క్లుప్తంగా

'మీ-సేవ'ల్లో అధిక డబ్బులు వసూలు చేయొద్దు

నిజామాబాద్అర్బన్: జిల్లాలోని అన్ని మీ–సేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే నిర్వాహకుల పై చర్యలు తప్పవని ఆర్డీవో రాజేంద్రకుమార్ హెచ్చరించారు. నగరంలోని న్యూఅంబేడ్కర్ భవన్‌లో నిజామాబాద్ ఉత్తర, దక్షిణ మండలాల పరిధిలోకి వచ్చే మీసేవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కేంద్రాల్లో ఉన్న ధరల పట్టిక ప్రకారమే డబ్బులు తీసుకోవాలని, రేషన్‌కార్డుల జారీకి ఎవరైనా మధ్యవర్తులు ఉంటే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో తహసీల్దార్లు విజయకాంత్‌రావు, బాలరాజ్, మీసేవ నిర్వాహకులు పాల్గొన్నారు.

సిబ్బందికి సమాచారం ఇవ్వాలి

సిరికొండ: విద్యుత్ సరఫరాలో ఏదైనా సమస్య తలెత్తితే రైతులు మరమ్మతులు చేయకుండా ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం అందించాలని నిజామాబాద్ రూరల్ డీఈ అల్జాపూర్ రమేశ్ సూచించారు. మండలంలోని మైలారం గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమంలో డీఈ పాల్గొని మాట్లాడారు. విద్యుత్ సేవలపై అవగాహన కల్పించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ బాలచంద్రం, లైన్‌మన్లు జగన్, సుభాష్, రైతులు నాగరాజు, చిన్నదాసు, విష్ణు, జనార్దన్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

మహరాజ్‌కు భగవద్గీత అందజేత



సుభాష్‌నగర్: నగరంలో పర్యటిస్తున్న పూజ్య స్వామి అవదేశానంద గిరి మహరాజ్‌ను మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీర్వాదాలు పొందారు. అనంతరం మహరాజ్‌కు భగవద్గీతను అందజేశారు. నగరంలోని అమ్మ వెంచర్‌లో నిర్మిస్తున్న వారాహి ఆలయాన్ని సందర్శించాలని మహరాజ్‌ను ఆయన కోరారు. ఆయన వెంట వైశ్య సంఘం ప్రతినిధులు లాభిశెట్టి శ్రీనివాస్, మాదాని శ్రీధర్ తదితరులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

సిరికొండ: మండలంలోని న్యావనంది గ్రామంలో ఎమ్మెల్సీ కవిత నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బీఆర్ఎస్ నాయకులు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ తోట రాజన్న, మాజీ సర్పంచ్ కన్క శ్రీనివాస్, తెలంగాణ జాగృతి రూరల్ కన్వీనర్ సాయిచరణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, వహీద్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్అర్బన్: నగరంలోని గిరిరాజ్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాంమోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొలిటికల్ సైన్స్, కామర్స్, గణితం, హిస్టరీ, బ్యాచలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్, స్టాటిస్టిక్స్, ఇంగ్లిష్, బీబీఏ లాజిస్టిక్, బిజినెస్ అనాలిటిక్స్, కంప్యూటర్ సైన్స్, తెలుగు, ఫైనాన్స్, బీసీఏ టాక్సేషన్, డేటా సైన్స్, బయోటెక్నాలజి సబ్జెక్టుల్లో బోధించేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈనెల 23 లోపు అభ్యర్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ధర్పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టుల్లో బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి శనివారం పేర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 23 లోపు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

21న సినీ సంగీత విభావరి

నిజామాబాద్ రూరల్: నగరంలోని గీతా భవనములో ఈ నెల 21న శ్రీ దాశరధి లలిత, సినీగీతాలతో సంగీత విభా వరి నిర్వహించనున్నట్లు స్వర సౌరభం అధ్యక్షుడు నాగారాజు శనివారం తెలిపారు. దాశరధి శత జయంతి పురస్కరించుకొని స్థానిక సాంస్కృతిక కళా సంస్థ స్వరసౌరభం, గీతాంజలి గి ల్డ్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలి

నిజామాబాద్అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని దీనికి నిరసనగా ఈ నెల 23న చేపట్టే చలో సెక్రటేరియట్ ముట్టడిని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించా రు. పిప్రి శివారులోని గురుకులంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి మృతిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోషమైన మహేశ్, మారుతి, వేణు, శివ, సంతోష్, బాబు, విశాల్ పాల్గొన్నారు.

ఎవరిని ఉంచుతారో పంపిస్తారో..



- బల్దియాలో ఒకే పోస్టుకు ఇద్దరేసి నియామకం
- ఏఎంసీ, శానిటరీ సూపర్‌వైజర్ పోస్టుల్లో గందరగోళం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు సరిపడా అధికారులు లేక పాలన కుంటుపడిన పరిస్థితి. ప్రస్తుతం ఒకే పోస్టుకు ఇద్దరేసి అధికారులను నియమించిన వైనం. ఒకే పోస్టుకు ఇద్దరు చొప్పున జాయినింగ్ కావడంతో ఇద్దరిలో ఎవరిని ఉంచాలో, ఎవరిని పంపాలో తెలియని అయోమయ స్థితి. ప్రస్తుతం బల్దియాలో ఇదే చర్చ సాగుతోంది.

ఏఎంసీకి ఇద్దరు..

అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పోస్టు బల్దియాలో ఒకే పోస్టు మంజూరైంది. జయకుమార్ సుదీర్ఘ కాలం బల్దియాలో శానిటరి ఇన్‌స్పెక్టర్‌గా, పదేళ్ల పాటు మేయర్ల వద్ద పీఏగా విధులు నిర్వహించి పదోన్నతిపై అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా జయకుమార్ 2025జనవరి31న బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ముందుగా ఇన్‌చార్జి ఎంహెచ్‌వోగా ఇచ్చి, తర్వాత రెవెన్యూ విభాగం అప్పగించడంతో రెవెన్యూ పనులు నిర్వహిస్తున్నారు. ఆయనకు సీడీఎం నుంచి డిజిటల్ సంతకం అనుమతి రావడంతో రెవెన్యూ పనులు పూర్తిచేస్తున్నారు.

అలాగే బల్దియాలో పనిచేస్తున్న ఎంఏ నజీర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నుంచి రెవెన్యూ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ కార్పొరేషన్‌లో ఆర్‌వోగా ఆయన అసలు పోస్టు. అయితే నిజామాబాద్‌వాసి అయిన ఎంఏ నజీర్ డిప్యుటేషన్ పద్ధతిన తిరిగి బల్దియాలో పోస్టు పొందాడు. కొద్దిరోజులు ఆర్‌వోగా విధులు నిర్వహించి ఆ బాధ్యతలు తాను మోయలేనని చేతులెత్తేయడంతో.. లిఖితపూర్వకంగా తెలపడంతో కమిషనర్ దిలీప్‌కుమార్ 2025 జనవరిలో ఆయనకంటే జూనియర్ అయిన ఖదీర్‌పాషాకు రెవెన్యూ ఆఫీసర్ బాధ్యతలు అప్పగించారు. దాంతో ఆయన సమర్థవంతంగా పన్నుల వసూళ్లలో నిజామాబాద్‌ను అగ్రస్థానంలో నిలబెట్టారు. ఎంఏ నజీర్ మాత్రం ప్రాధాన్యత లేని పోస్టులో దాదాపు 8 నెలలు కొనసాగారు. ఖదీర్ పాషా పదోన్నతిపై సిరిసిల్లా బదిలీపై వెళ్లారు. ఎంఏ నజీర్‌కు ఇటీవల ఏఎంసీగా పదోన్నతి లభించింది. ఏఎంసీ పోస్టును నిజామాబాద్ కార్పొరేషన్‌లోనే పోస్టు తెచ్చుకున్నాడు.

సీడీఎంఏ ఉత్తర్వుల మేరకు

ఏఎంసీగా ఉన్న జయకుమార్‌ను రిలీవ్‌చేయాలని, ఆయనను వెంటనే సీడీఎంఏలో రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ తమకు ఉత్తర్వులు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ తెలిపారు. శానిటరి సూపర్‌వైజర్ల విషయం ఇంకా ఏమీ నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు.

అంతా అయోమయం..

సీడీఎంఏ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు కమిషనర్ దిలీప్‌కుమార్ ఎంఏ నజీర్‌ను జూన్ 24న జాయినింగ్ చేసుకున్నారు. ఆయనకు ఎలాంటి విధులు కేటాయించలేదు. ఒకే పోస్టుకు ఇద్దరు ఉద్యోగులున్నారు. వారిలో ఎవరికి రెవెన్యూ బాధ్యతలు అప్పగిస్తారన్న అయోమయం నెలకొంది. ఎంఏ నజీర్‌ను ఏఎంసీగా నియమించి జయకుమార్‌ను సీడీఎంఏలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు వెలువడినట్లు తెలిసింది. దీంతో జయకుమార్ బల్దియా నుంచి రిలీవ్ కానున్నారు. ఆయన మరో 10 నెలల్లో పదవీ విరమణ పొందనున్నారు. 6 నెలల ముందు ఏఎంసీగా నియమించబడి, విధులు నిర్వహిస్తున్న జయకుమార్‌ను సీడీఎంఏకు పంపడం. నెల క్రితం వచ్చిన ఎంఏ నజీర్‌ను ఏఎంసీగా తీసుకోవడం సర్వత్రా చర్చ కొనసాగుతోంది.

శానిటేషన్ సూపర్‌వైజర్ల పరిస్థితి అలాగే..

శానిటేషన్ విభాగంలో సూపర్‌వైజర్‌గా సాజిద్ అలీ విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పోస్టు ఆదిలాబాద్‌లో. అయితే ఆయన డిప్యుటేషన్‌పై బల్దియాలో శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. తాజాగా ఆదిలాబాద్‌లో శానిటరి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఎం నరేందర్‌ను పదోన్నతిపై బల్దియాకు శానిటరి సూపర్‌వైజర్‌గా నియమించారు. ఆయన శుక్రవారం రిపోర్టు చేశారు. ఇద్దరిలో ఎవరిని శానిటరీ సూపర్‌వైజర్‌గా నియమిస్తారు.? ఎవరిని పంపిస్తారనేది చర్చ మున్సిపల్‌లో చర్చ సాగుతోంది. లేదా ఇద్దరిని కొనసాగిస్తారా అనే మీమాంస జరుగుతోంది.

నేటి చిత్రం


ప్రధాన రోడ్డులో నిలిచిన నీరు

ప్రధాన రోడ్డుపై నీటి గుంతలు

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్‌లో ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షపు నీళ్లు అందులో నిల్వ ఉంటున్నాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వాహనదారులు ఆ ప్రాంతంలో అదుపు తప్పి కిందపడిపోతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– అప్పాల అరుణ్, సికింద్రాపూర్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 నిజామాబాద్ రూరల్ - 97053 46541

రైతు వేదికలకు నిలిచిన నిధులు

- వ్యవసాయ అధికారులపైనే నిర్వహణ భారం
- పేరుకు పోయిన బకాయిలు


దుబ్బాకలోని రైతు వేదిక

ధర్పల్లి: రైతులు నిరంతరంగా సమావేశాలు నిర్వహించుకొని పంటల సాగు, వ్యవసాయంలో కొత్త విధానాలు, అధికారుల సూచనలు తెలుసుకునేందుకు వీలుగా రైతు వేదికలను గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ క్లస్టర్ల వారీగా వీటిని నిర్మించింది. వ్యవసాయశాఖతోపాటు అనుబంధ విభాగాలు, ఇతర శాఖలకు సంబంధించి అవసరమైన సమావేశాలు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామానికి దూరంగా, కొన్ని దగ్గరగా నిర్మించారు. కార్యాలయాలు ఏర్పాటు చేసింది. కానీ వాటి నిర్వహణకు నిధులు కేటాయించడంలేదు. ప్రతివారం రైతు నేస్తం కార్యక్రమాల నిర్వహణతో పాటుతో పంటల సాగులో మెలకువలు కోసం ఏర్పాటు చేసే అవగాహన సదస్సులు, పలు ప్రభుత్వ పథకాలను ప్రజలకు, రైతులకు చేరవేసేందుకు నిర్వహించే భారం అంతా వ్యవసాయ శాఖ అధికారులపైనే పడుతోంది.

ఏఈఓలకు కష్టాలు

ధర్పల్లి మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా రామడుగు, దుబ్బాక, ధర్పల్లి, హోన్నాజీపేట్ పంచాయతీల్లో రైతు వేదికలను గత ప్రభుత్వంలో సంబంధిత అధికారులు నిర్మించారు. ప్రస్తుతం రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయకపోవడంతో ఏఈఓలు ఇబ్బంది పడుతున్నారు. కొందరు సొంత డబ్బులు నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు.

శిక్షణ కార్యక్రమాలు–సమావేశాలు

వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులకు అందుబాటులో ఉండేందుకు వీలుగా వేదికలో వసతి కల్పించారు. ప్రత్యేకంగా ఫర్నిచర్ కూడా సమకూర్చారు. శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన కుర్చీలు, మైకు వంటివి ఏర్పాటు చేశారు. సీజన్ల వారీగా పంటల సాగుపై అవసరమైన వారికి సలహాలు, సూచనలు ఇస్తుంటారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వ్యవసాయ, రైతు సమావేశాలు నిర్వహించారు. వీటిని ఇతర శాఖలు కూడా వినియోగించుకుంటున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే గ్రామాల్లో మినీ వేడుక మందిరంగా కూడా ఉపయోగపడుతుంది.

భారంగా నిర్వహణ

రైతు వేదిక నిర్వహణ కోసం ప్రభుత్వం నెలకు రూ.9 వేలు విడుదల చేసేది. గత కొంతకాలంగా నిధులు ఆగిపోవడంతో రైతు వేదికల నిర్వహణ అధికారులకు భారంగా మారింది. రైతు వేదికల విద్యుత్ బిల్లులు రూ. వేలల్లో పేరుకు పోతున్నాయి. స్వీపర్, తాగునీటి ఖర్చు తదితర ఖర్చులను కొన్నిచోట్ల ఏఈవోలే భరిస్తున్నారు.

గల్ఫ్ బాధితులను ఆదుకుంది కాంగ్రెస్ ప్రభుత్వమే..


సమావేశంలో మాట్లాడుతున్న రామర్తి గోపి

ఖలీల్‌వాడి: గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చింది కాంగ్రెస్‌పార్టే అని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రామర్తి గోపి అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ఆర్ఐ పాలసీ తీసుకొస్తామని చెప్పి తీసుకురాలేదని అన్నారు. ఇటీవల వేల్పూర్‌లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ బాధితులను ఆదుకోవడం లేదని మాట్లాడడం సబబుకాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సహాయ వివరాలను తెలిపేందుకు వెళ్లిన తమ పార్టీ నాయకుడు దేవేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేయడం సరైందని కాదని దీనిని తాము ఖండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌కు దాడి చేసే సంస్కృతి లేదన్నారు. రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఎన్ఆర్ఐ పాలసీపై అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణురాజ్, విక్కీ యాదవ్, ప్రీతం, ప్రమోద్, శోభన్, జిల్లెల రమేశ్, అవిన్, బోటి వినోద్ కుమార్, నరేంద్ర సింగ్, సుంకెట విశాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కమిషనర్



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటనకు వచ్చిన రాజయ్యను ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

పాఠశాలల్లో వైభవంగా బోనాల పండుగ


మంచిప్పలో బోనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు


పోతరాజు వేషధారణలో పీఎస్ఆర్ స్కూల్ విద్యార్థులు


కొలిప్యాక్‌లో..

మోపాల్: మండలంలోని సిర్‌పూర్, మంచిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శనివారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. మంచిప్పలో జెడ్పీహెచ్ఎస్ నుంచి బోనాలను పెద్దమ్మ గుడి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అలాగే సిర్‌పూర్‌లో పిల్లలు బోనాలు, మంగళహారతులతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు సత్యనారాయణ, బి సాయిలు, ఉపాధ్యాయులు శ్రావణి, అపర్ణ, సంధ్య, రాజేశ్వరి, పీఈటీ దేవేందర్, శ్యామల, వందన, హజారే శ్రీనివాస్, లలిత, కాసర్ల నరేశ్, రాము, అనురాధ, వసంత పాల్గొన్నారు.

ఖలీల్‌వాడి: నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న పీఎస్ఆర్ స్కూల్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యాదేశ్‌గౌడ్, సిబ్బంది వీణా, ప్రసన్న, శ్రీహరి ఉన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని కొలిప్యాక్ జెడ్పీ ఉన్నత పాఠశాల, కలిగోట్ సిద్ధార్థ పాఠశాలల్లో విద్యార్థులు బోనాల పండుగ నిర్వహించారు. ఉపాధ్యాయులు సిరిల్‌రావు, సిద్ధార్థ కరస్పాండెంట్ గంగారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షం.. హర్షం


గడ్కోల్ వద్ద పొలాల నుంచి పారుతున్న వరద

సిరికొండ: మండలంలోని తూంపల్లి, కొండాపూర్, గడ్కోల్, ముషీర్‌నగర్ గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షానికి మొండి వాగు, గుంతల ఒర్రె, రాముడు ఒర్రె చిన్న పాటి వాగులు ప్రవహించాయి. నెర్రెలు బారిన పొలాల్లో నీళ్లు కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు


గుంతలమయంగా మారిన మోడల్ స్కూల్ రోడ్డు


గుంతలు పడిన నల్లగుట్ట తండా రోడ్డు

- గుంతలమయంగా మారిన జక్రాన్‌పల్లి-నల్లగుట్ట తండా రోడ్డు
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు

జక్రాన్‌పల్లి: మండలంలోని జక్రాన్‌పల్లి నుంచి నల్లగుట్ట తండాకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జక్రాన్‌పల్లి నుంచి నల్లగుట్ట తండాకు వెళ్లే రోడ్డులోనే మోడల్ స్కూల్, కేజీబీవీలు ఉన్నాయి. రోడ్డు బాగా లేకపోవడంతో మోడల్, కేజీబీవీలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోడల్ స్కూల్‌కు విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఆటోలోనే ప్రయాణిస్తుంటారు. కానీ రోడ్డు గుంతలమయంగా మారడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇరు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, నల్లగుట్ట తండావాసులు, అటువైపు పంట పొలాలు ఉన్న రైతులు అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. వాహనదారులు ఈ రోడ్డు వెంట ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. ఈ రోడ్డులో ఎక్కువగా మూలమలుపులు ఉండడంతో ఎప్పుడు ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు



తెలంగాణ ఆదర్శ పాఠశాల, కేజీబీవీలకు వెళ్లే రోడ్డు కంకరతేలి అధ్వానంగా మారింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డును బాగు చేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలి.

– కన్నెపల్లి ప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు

నిధులు మంజూరు చేయాలి



జక్రాన్‌పల్లి నుంచి నల్లగుట్ట తండా వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డులో ఎన్నో గుంతలు ఉన్నాయి. రోడ్డు వెంట మూలమలుపులు ఎక్కువగా ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలి.

– అబ్బుగోని జగదీశ్వర్, జక్రాన్‌పల్లి

రోడ్డుపై ప్రయాణించలేక పోతున్నాం



ఆటోలో ప్రతి రోజు మోడల్ స్కూల్‌కు విద్యార్థులను తీసుకెళ్తుంటాను. రోడ్డు బాగా లేకపోవడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డుపై ప్రయాణించాలంటే భయంగా ఉంది. అధికారులు స్పందించాలి

– శివ, ఆటో డ్రైవర్, చాంద్‌మియాబాగ్

సంక్షిప్తం

ఖిల్లా డిచ్‌పల్లిలో గోపాలకాల్వ

డిచ్‌పల్లి: వర్షాలు బాగా కురవాలని కోరుతూ శనివారం డిచ్‌పల్లి ఖిల్లా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గోపాలకాల్వ నిర్వహించారు. గ్రామంలోని పెద్ద హనుమాన్ మందిరం వద్ద నిర్వహించిన గోపాలకాల్వ లో పెద్ద సంఖ్యలో యువకులు పోటీలు పడ్డారు. గొల్ల సాయిలు అనే వ్యక్తి విజేతగా నిలిచారు. వర్షాలు బాగా కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ గ్రామంలో కప్పతల్లి ఆటలు, గోపాలకాల్వ నిర్వహించినట్లు గ్రామపెద్దలు తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించండి

ధర్పల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు, ప్రహరీకి నిధులు మంజూరు చేయాలని పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్ రాజారెడ్డి, సతీశ్ కుమార్ అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ శాంత, ఎంపీడీవో లక్ష్మారెడ్డిని కలిసి సమస్యలను విన్నవించారు. పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అంకం నరేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు సత్తనారాయణ పాల్గొన్నారు.

వినియోగదారులకు వసతులు కల్పించాలి

సుభాష్‌నగర్: పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు వసతులు కల్పించాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి అరవింద్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పెట్రోల్ బంక్ డీలర్లకు సూచించారు. డీఎస్‌వో, డీఎంలను పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు నల్ల దినేశ్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్ గుప్తా, కార్యదర్శి పూర్ణ ప్రసాద్, కోశాధికారి విజయ్‌కుమార్ స్వామి, నాయకులు వెంకట నర్సాగౌడ్, వినోద్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్ట్

మోపాల్: మండలంలోని కంజర్ గ్రామశివారులో గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను పట్టుకున్నట్లు ఎస్సై జెడ్ సుస్మిత శనివారం తెలిపారు. కంజర్ గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్, చిన్నోళ్ల జశ్వంత్, షేక్ ఆరిఫ్ గంజాయి సేవిస్తున్నారు. అదే సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు వారిని పట్టుకొని పరీక్షించగా పాజిటివ్‌గా రిపోర్టులు వచ్చాయి. యువకులు గంజాయికి బానిసైనట్లుగా తెలిసింది. యువకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోలీసులను బెదిరించిన వారిపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని అహ్మదీ బజార్ రోడ్డుపై ఉన్న తోపుడు బండ్లు, షాపులు, రేకులను తొలగిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ట్రాఫిక్ సీఐ ప్రసాద్‌తోపాటు సిబ్బందిని బెదిరించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపారు. షాపులను క్లియర్ చేస్తున్న సమయంలో పోలీసులను నీ అంతు చూస్తామంటూ విధులకు ఆటంకం కలిగించిన షెహబాజ్, మజీద్, హర్షద్, షేక్ అద్నాన్, ఖలీద్‌ఖాన్‌తోపాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మొరం తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

నిజామాబాద్ రూరల్: రూరల్ పీఎస్ పరిధిలోని మల్లారం శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపారు. మండల పరిధిలో అడవుల్లో ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక, మొరం తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.